ప్రజాశక్తి
మంగళవారం 16 జులై 2024
5
అనంతపురం






అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రతిపక్షంలో ఉండగా సామాన్యులకు అండగా ఉంటామని హామీలు గుప్పించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తూనే వాటికి తిలోదకాలిచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్న భోజన ఏజెన్సీలను ఏకపక్షంగా రద్దు చేసి తమ వారికిస్తున్నారన్న ఆరోపణలు నెలకొన్నాయి. అధికారంలోకి వచ్చిన 40 రోజుల వ్యవధిలోనే పావు వంతు మధ్యాహ్న భోజన ఏజెన్సీలను రద్దు చేసింది. ఇందులో నిబంధనలు కూడా పాటించకుండానే తొలగించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





# మిడ్‌డేమీల్స్‌పై.. 'అధికార' బెదిరింపు..!

- ఏకపక్షంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలు రద్దు
- ఇప్పటికే పావు వంతు తొలగింపు
- ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

టిడిపి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా ఉపాధి లభించే వాటిపై టిడిపి శ్రేణులు దృష్టి సారించాయి. ఇందులో భాగంగా రేషన్ షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్, యానిమేటర్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ తదితర వాటిని దక్కించుకునే ప్రయత్నాలు ఆరంభించారు. ఇందులో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు పాత వారిని మార్చేసి టిడిపి మద్దతుదారులకు అప్పగించే ప్రయత్నం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నడుస్తోంది. ఇప్పటికే చాలా పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీలను తొలగించారు. అనంతపురం జిల్లాలో మొత్తం 1640 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు నడుస్తున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టే పనిని వీరు చేస్తారు. 2003 నుంచి వీరు పనిచేస్తూ వస్తున్నారు. అటువంటి వారిని కూడా ఇప్పుడు తొలగించేశారు. టిడిపి అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇక తమవారికివ్వాలి కాబట్టి తప్పుకోవాలని స్థానిక నాయకులు ఏజెన్సీ నిర్వాహకులపై ఒత్తిళ్ల పెంచుతున్నారు. దీంతో అధికారులు ఉన్న వారిని కాదని కొత్తవారికి ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు చెప్పడంతో నిర్వాహకులు దిక్కుతోచడం లేదు. ఉన్నఫలంగా ఉపాధి కోల్పోతుండటంతో తమ బాధ ఎవరితో చెప్పుకోవాలో పాలుపోని పరిస్థితుల్లో వారు ఉన్నారు. ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలోని 32 మండలాల్లో కలిపి సుమారు 400 మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చేశారు.

**నిబంధనలకు తిలోదకాలు**

మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలంటే కొన్ని నిబంధనలున్నాయి. వాటిని ఏ మాత్రం పాటించడం లేదు. సరిగా భోజనం లేకపోతే ముందుగా నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. మూడు నోటీసుల తరువాత కూడా తప్పులు జరిగితే అప్పుడు పాఠశాల యాజమాన్య కమిటీలో నిర్ణయం చేసి ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాతవారిని తొలగించి కొత్త వారికివ్వాల్సి ఉంటుంది. ఇవేవీ పాటించకుండానే ఏకపక్షంగా ఏజెన్సీలను రద్దు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులేమి పట్టనట్టు ఉన్నారు. అధికారపార్టీ నేతలు ఆదేశాలకు అనుగుణంగా పై మార్గదర్శకాలేవి పాటించకుండానే నేరుగా పాతవారిని తప్పించి కొత్తవారికి బాధ్యతలు ఇస్తుండటం గమనార్హం.

**తొలగింపు సరికాదు**

మధ్యాహ్న భోజన ఏజెన్సీలను ఇష్టారీతిన మార్చడం సరైంది కాదు. లోపాలుంటే ముందుగా వారి దృష్టికి తీసుకెళ్లాలి. సరిచేసే ప్రయత్నం చేయాలి. అలాకాకుండా రాజకీయ ఒత్తిళ్ల మేరకు మార్పులు చేయడం సరైంది కాదు. నిబంధనలు పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు మేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ రకంగా తొలగించడం మంచిది కాదు. ఈ విషయాన్ని తాము ఎంఇఒ, ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. వారైనా దీనిపై స్పందించాలి.

**నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు.**

# త్వరితగతిన సమస్యలకు పరిష్కారం

## కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 380 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపించాలన్నారు. సమస్యలను స్వయంగా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి అధికారులు ఖచ్చితంగా హాజరుకావాలన్నారు. ఏ శాఖ పరిధిలో ఎవరికి ఎన్ని అర్జీలు వచ్చాయనే దానిపై క్రమం తప్పకుండా నివేదికలు అందించాలన్నారు. ఎక్కువ అర్జీలు వచ్చిన కార్యాలయాలను తాను తనిఖీ చేస్తానన్నారు. అర్జీలు ఎక్కువ ఎందుకు వచ్చాయి అనే దానిపై పరిశీలించాలని, ఎక్కడ సమస్య ఉందో పరిశీలించుకుని అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, ల్యాండ్, సివిల్ సప్లైస్, అగ్రికల్చర్, హార్టికల్చర్, తదితర శాఖలకు సంబంధించి జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తారని, విద్య, సర్వ శిక్ష అభియాన్, ఆర్‌డబ్ల్యూఎస్, వెల్ఫేర్ శాఖలకు సంబంధించి జిల్లా పరిషత్ సీఈవో, మెప్మా, అర్బన్ పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ శాఖలు, హెచ్ఎల్సి, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర శాఖలు నగరపాలక సంస్థ కమిషనర్, డిజాస్టర్ మేనేజ్మెంట్, పబ్లిక్ గ్రీవెన్స్, తదితర శాఖలకు సంబంధించి డిఆర్ఒ పర్యవేక్షిస్తారని తెలిపారు. వచ్చే వారంలో ఎంఈవోలతో బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని ప్రయివేటు పాఠశాలలను తనిఖీ చేయించి, వాటిలో లోపాలను గుర్తించాలని డిఇఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వికలాంగులకు కృత్రిమ కాళ్లను స్వయంగా అమరస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**వికలాంగులకు కత్రిమ కాళ్లు అందజేత**

అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముగ్గురు వికలాంగులకు కత్రిమ కాళ్ల (ఆర్టిఫిషియల్ లెగ్స్)ను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సోమవారం నాడు పంపిణీ చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పుట్లూరు మండలం కందిగోపుల గ్రామానికి చెందిన వెంకట రామయ్య, ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన ఓబులమ్మ, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన భాగ్యమ్మకు ఒక్కొక్కరికి రూ.3 వేలు విలువజేసే కత్రిమ కాళ్లు, వెయ్యి రూపాయలు విలువజేసే చేతికర్రలను అందించారు. వికలాంగులు వారు కూర్చొన్న చోటుకే కలెక్టర్ వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వికలాంగులకు కత్రిమ కాళ్లు అందజేసేందుకు విస్తతంగా అవగాహన కల్పించాలని వికలాంగుల సంక్షేమ శాఖ ఎడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి రసూల్ పాల్గొన్నారు.



డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయంలో మొక్క నాటుతున్న కలెక్టర్

# హరిత 'అనంత'ను సాధిద్దాం : కలెక్టర్

**ప్రజాశక్తి- అనంతపురం అర్బన్**

ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి హరిత అనంతను సాధిద్దామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవితో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. హరిత అనంతను తయారు చేసేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం నాటిని మొక్కలను సంరక్షిస్తామని కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్ రావు, మలేరియా నివారణ అధికారి ఓబులు, స్టాటిస్టికల్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, ఆఫీస్ సూపరింటెండెంట్లు విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, సురేష్ కుమార్, పవన్, కమలాకర్ రాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డిఎం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రామచంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు సర్వీసుల నిర్వహణ, ప్రయాణికుల ఇబ్బందులు, బస్సులో సౌకర్యాలు, తదితర అంశాలపై ప్రయాణికులు ఫిర్యాదు చేసుందుకు ఆర్టీసీ సంస్థ అవకాశం కల్పించిందన్నారు. ఇందుకోసం 99592 25862 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలపై చర్చించే అవకాశం కల్పిస్తున్నా మన్నారు.

## కెఎల్‌పి క్రికెట్ టోర్నీ కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించే కెఎల్‌పి క్రికెట్ టోర్నీకి ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నారు. ప్రజావేదికలో సోమవారం క్రీడాకారులు, నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టోర్నమెంట్ అధ్యక్షులుగా మోరేపల్లి మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా పాల్గొండ్ల శ్రీరాములు, కార్యదర్శిగా వైపి.రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోపి, జాయింట్ కార్యదర్శిగా కొండాపురం అనిల్‌చౌదరి, ట్రెజరర్‌గా కార్తీక్‌బాబులను ఎన్నుకున్నట్లు మున్సిపల్ మాజీ ఛైర్మన్ వైపి. రమేష్ తెలిపారు. అలాగే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులతో పాటు ప్రోత్సహించేందుకు విచ్చేసిన వివిధ సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు కూడా ప్రకటించారు.

# కేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి

## ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ తెలియజేశారు. సోమవారం నాడు అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని పరిశీలించారు. జెఎన్‌టియు ఇంక్యుబేషన్ సెంటర్ ప్రాంగణంలో ఎంపీకి ఉపకులపతి, ఆచార్య ఎస్ఎ.కోరి స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయం విద్యా ప్రమాణాల పరంగా సాధించిన పురోగతి, జంతులూరులో రాబోయే కొత్త ప్రాంగణానికి సంబంధించిన వివరాలను ఎంపీకి ఉపకులపతి తెలియజేశారు. ఆగస్టులో ప్రారంభమయ్యే తదుపరి సెమిస్టర్ కొత్త క్యాంపస్‌లో ప్రారంభమవుతుందని ఎంపీకి తెలిపారు. విశ్వవిద్యాలయం ఈ వచ్చే విద్యా సంవత్సరంలో అదనంగా 12 కోర్సులను అందిస్తోందని, ఆరు సబ్జెక్టులలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెడుతోందని వివరించారు. ప్రస్తుతం 20 కంటే ఎక్కువ రాష్ట్రాల విద్యార్థులు వర్సిటీలో చదువుతున్నారని తెలిపారు. కొత్త ప్రాంగణం విశేషాలు, సౌకర్యాలు, నిర్మాణ స్థితిని వైస్ ఛాన్సలర్ ఎంపీకి వివరించగా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిపిడబ్ల్యూడి అనంతపురం, ఇంజినీర్ ఎంఎస్ఎన్ఎల్ శ్రీనివాస్ సాంకేతిక వివరాలను తెలియపరిచారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధిపై తాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ విషయమై కేంద్ర విద్యాశాఖ మంత్రితో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని స్వయంగా కలుస్తానని తెలిపారు. మైనింగ్, సోషియాలజీ, టెక్స్‌టైల్స్, జియాలజీ, ఆంత్రోపాలజీ, కరువు అధ్యయనాలు వంటి సబ్జెక్టులలో విశ్వవిద్యాలయం కార్యక్రమాలు ప్రారంభించాలని ఆయన విసిని కోరారు. ఈ కార్యక్రమంలో సియుఎపి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఉమేష్ కుమార్, ప్రొఫెసర్ శీలా రెడ్డి పాల్గొన్నారు.



కేంద్రీయ విశ్వవిద్యాలయం విసితో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

# పని ఒత్తిళ్లతోనే కార్మికుల ఆకస్మిక మృతి

## నాలుగురోజుల వ్యవధిలో ఇద్దరు మృత్యువాత

## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అధిక పనిభారంతో అనేకమంది కార్మికులు సతమతమవుతూ నిద్రలోనే కన్నుమూస్తున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నిద్రలోనే కనుమూసిన కార్మికురాలు పెద్దక్క ఇంటికి సిఐటియు నాయకులు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో జనాభాకు తగ్గట్టుగా 1200 మంది పారిశుధ్య కార్మికులు పని చేయాల్సి ఉందన్నారు. అయితే కేవలం 650 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. రెట్టింపు పని భారం కార్మికులకు శాపంగా మారుతోందన్నారు. నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు పారిశుధ్య కార్మికులు కొండన్న, పెద్దక్క అనారోగ్య కారణాలతో నిద్రలోనే కన్నుమూయడం బాధాకరమన్నారు. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని అనేకమార్లు విజ్ఞప్తులు చేసినా, ఆందోళనలు చేసినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. ఈనేపథ్యంలో కార్మికులపై పనిభారం పెరిగి అనారోగ్యం పాలవుతూ మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల పని భారం తగ్గించేందుకు కార్మిక సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పెద్దక్క మృతదేహాన్ని హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి సందర్శించి దహన సంస్కారాలకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ, సహకారాలను త్వరగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, రెగ్యులర్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ ముత్తురాజు, ఎం.నల్లప్ప, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, సాకే తిరుమలేష్, ఉపాధ్యక్షులు శశీంద్రకుమార్, లక్ష్మీనరసమ్మ, నారాయణస్వామి, శివ, ప్రభాకర్, కమల్, అంపన్న, కార్మికులు పాల్గొన్నారు.



పెద్దక్కకు నివాళులర్పిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు

# ఆర్థిక శాఖ మంత్రితో సవిత భేటీ



కేశవ్‌కు మొక్కను అందిస్తున్న మంత్రి సవిత

**ప్రజాశక్తి-అనంతపురం**

విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖా మంత్రి సవితమ్మ సోమవారం నాడు కలశారు. కేశవ్‌కు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో మంత్రి సవితమ్మ మాట్లాడారు.

# ఆగిపోయిన పనులను ప్రారంభించండి

## కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లావ్యాప్తంగా పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఆగిపోయిన పనులను వెంటనే మొదలు పెట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో పంచాయతీరాజ్ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని ఎన్ఆర్ఈజిఎస్, ఎస్డిపి, 15 ఫైనాన్స్, అంగన్వాడీ భవనాలు, బిఎంసియులు, డిజిటల్ లైబ్రరీలు, ఏసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, సిసిరోడ్లు, వివిధ రహదారుల నిర్మాణానికి సంబంధించిన పనులను వెంటనే మొదలుపెట్టి సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే శనివారంలోపు పీఎంజిఎస్‌వై కింద రాయదుర్గం - భూపసముద్రం, ఉరవకొండ - కనేకల్లు, తదితర రహదారుల నిర్మాణం మొదలుపెట్టాలన్నారు. రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ కెవికెవి.ప్రసాద్, ఈఈ చంద్రశేఖర్, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**ఎలైట్ బయోటెక్నాలజీస్ లాంటి కంపెనీలు మరిన్ని తీసుకురావాలి**

ఎలైట్ బయోటెక్నాలజీస్ లాంటి కంపెనీలు మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం రాప్తాడు మండలంలోని గొందిరెడ్డిపల్లి వద్దనున్న ఎంఎస్ఎంఈ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఎలైట్ బయోటెక్నాలజీస్ కంపెనీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలైట్ బయోటెక్నాలజీస్ లాంటి కంపెనీలను మరిన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందాని అధికారులతో ఆరా తీశారు. కంపెనీలో చేపట్టిన అరటి పిలకల తయారీని పరిశీలించారు. ఇక్కడ అరటి పిలకల తయారీని చక్కగా చేస్తున్నారని పేర్కొన్నారు. హార్టికల్చర్ డిడి ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ ఎలైట్ బయోటెక్నాలజీస్‌ని 2021-22లో 30 సెంట్లు 2.61 కోట్ల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అరటి పిలకల తయారీని చేస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి 25 లక్షల మొక్కల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ కంపెనీ పనిచేస్తుందన్నారు. జి9, యాలక్కి, కర్పూర, చక్కర కేళి, సుగందాలు, లాంటి అరటి పిలకల తయారీని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎలైట్ బయోటెక్నాలజీస్ ఎదుట మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ రఘునాథరెడ్డి, ఎలైట్ బయోటెక్నాలజీస్ ప్రమోటర్ రాఘవేంద్ర, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

## సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో ప్రభుత్వ సంస్థలలో దినసరి వేతనాలపై ఆధారపడి పని చేసే ఉద్యోగ కార్మికులకు కనీస వేతనాలు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిత్యావసర ధరలకు అనుగుణంగా చిరు ఉద్యోగులు కార్మికులకు కనీస వేతనాలు పెంపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో వేతనాలు నిర్ణయించి ప్రకటించారని, జిల్లాలో కూడా తక్షణమే వేతనాలు పెంచి కార్మికులు, ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, నగర కార్యదర్శి వెంకట్‌నారాయణ పాల్గొన్నారు.

అలాగే భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకంగా ఉన్న 1214 మెమోను తక్షణమే రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కార్యకలాపాలు పునరుద్ధరించాలని జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు



విరిగిన విద్యుత్ స్తంభం

# పొంచి ఉన్న ప్రమాదం

## విరిగిన విద్యుత్ స్తంభం
## ఆందోళనలో ఉద్యోగులు, ప్రజలు

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల ప్రధాన గేటు వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. 11కెవి విద్యుత్ స్తంభం పైన విరిగింది. దీంతో విద్యుత్ వైర్లు ఎప్పుడు కింద పడతాయో.. అని ప్రజలు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చి పోయే రోగులు, వందల కొద్దీ గర్భిణులు, బాలింతలు, పిల్లలు, ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ వైద్యశాల గేటు ముందు ఇలా ప్రమాదకరంగా కరెంటు పోలు ఉండటంతో అందరూ భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ తీగలు కిందికి వంగి వేలాడుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే దారిలోనే బదిరీల పాఠశాల కూడా ఉంది. పాఠశాలకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు నిత్యం తిరుగుతూనే ఉంటారు. వీరికితోడు అధికారులు సైతం తిరుగుతూనే ఉంటారు. అయినా ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానికులు, రోగులు, ప్రజలు కోరుతున్నారు.

# కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-నార్పల**

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామిని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం సాయంత్రం సామాన్య భక్తుల్లా క్యూలైన్లలో వెళ్లి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రొటోకాల్ పక్కనపెట్టి సామాన్య భక్తుల్లా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో భక్తులు పడుతున్న ఇబ్బందులను దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల్లాయిస్వామి పెద్ద సరిహద్దు, జలది, చివరి దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో టిడిపి నాయకులు ఆలం నరసానాయుడు, ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల అరుణమ్మ, ఆకుల విజయకుమార్ (బాబు), దారపనేని చంద్రబాబు, పిట్టు రంగారెడ్డి, జాఫర్‌వలి, ప్రతాప్‌చౌదరి, రాజన్న, నరసింహులు, ఓబులేసు, రాజేష్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ రాముడు, ఆలయ కార్యనిర్వాహణాధికారిణి సాకేతపురం శోభ, తదితరులు పాల్గొన్నారు.


క్యూలైన్‌లో కుళ్లాయిస్వామిని దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**గూగూడులో టిడిపి నాయకుల 'ట్రాఫిక్' విధులు**

మండల కేంద్రంలోని గూగూడులో వెలిసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో విపరీతంగా ట్రాఫిక్ స్తంభించడంతో టిడిపి నాయకులు క్లియరెన్స్ చేసేందుకు యత్నించారు. ముఖ్యంగా శనివారం నుంచి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన చిన్న సరిగెత్తు, పెద్దసరిగెత్తులు ప్రారంభం కావడంతో గూగూడుకు భక్తుల తాకిడి మొదలైంది. స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. భక్తులు అటు ముందుకు..ఇటు వెనక్కు రాలేని పరిస్థితి. ఈనేపథ్యంలో స్వామి దర్శనానికి వచ్చిన టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు స్వయానా దగ్గరుండి ట్రాఫిక్‌ను నియంత్రించే పనులు చేపట్టారు. పోలీసులకు సాయం చేస్తూ వాహనాలను దారి మళ్లింపు చర్యలు చేపట్టారు. భక్తుల ఇబ్బందులను గుర్తించి నరసానాయుడు చూపిన చొరవ పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# బాస్కెట్‌బాల్ విజేతకు అభినందన

**ప్రజాశక్తి-అనంతపురం**

శ్రీలంకలో జరిగిన ఆసియా కప్ ఫిబా బాస్కెట్‌బాల్ పోటీల్లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించి విజేతగా నిలిచిన మాంటిస్సోరి విద్యార్థి ద్వారకనాథ్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పాఠశాలల్లో కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అనంతపురం ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపారని కొనియాడుతూ తల్లితండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాళ్లు పద్మావతి, రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాకారుడు ద్వారకనాథ్‌రెడ్డిని అభినందిస్తున్న మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

# ఆయిల్ ఫామ్‌సాగును సద్వినియోగం చేసుకోవాలి

## కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఆయిల్ ఫామ్ సాగుని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించిన పాంప్లెట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ ఆయిల్ ఫామ్ పరిశోధనా సంస్థ సాంకేతిక సహకారంతో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్, డి.హిరేహాల్, కణేకల్ మండలాలు, ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగును చేపట్టేందుకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను చేపట్టాలన్నారు. ఎస్‌ఆర్‌ఐజిఎస్ అనుసంధానంతో 100 శాతం బోర్‌వెల్, డ్రిప్ సౌకర్యం ఉండి ఒక రైతుకు 2 నుంచి 4 హెక్టార్ల వరకు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. మరిన్ని వివరాలు ఉద్యాన శాఖ అధికారుల ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని, అనంతపురం డిహెచ్ఓ 7995086792, ఉరవకొండ ఉద్యాన శాఖ అధికారి 7995086998, అనంతపురం ఉద్యాన శాఖ అధికారి 7995086997 నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

**మన పచ్చని అనంతపురం కోసం.. పోస్టర్ల ఆవిష్కరణ**

జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హరిత అనంతలో భాగంగా మన పచ్చని అనంతపురం కోసం.. అంటూ తయారుచేసిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన ప్లాంటేషన్ కార్యక్రమాలు, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, చెట్ల నిర్వహణ, వాటి సంరక్షణ అంశాలపై తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, హార్టికల్చర్ డిడి ఫిరోజ్ ఖాన్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు


హైకోర్టు జడ్జికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

# అశ్వర్థ నారాయణస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

**పెద్దపప్పూరు :** మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవాని భీమలింగేశ్వర స్వామివార్లను హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత పట్టువస్త్రాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సుబ్రమణ్యం, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

**అనంతపురం కార్పొరేషన్ :** నాలుగు నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందిన మున్సిపల్ కార్పొరేషన్‌లోని విద్యుత్ విభాగంలో పని చేసే మాబు కుటుంబానికి కార్మికులు ఒకరోజు వేతనం కింద వసూలైన 1,25,000 అందజేశారు. సోమవారం కార్పొరేషన్‌లోని ఛాంబర్‌లో కమిషనర్ మేఘస్వరూప్ మాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఇంజనీరింగ్ కార్మికుల జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా కార్యదర్శి సంజీవరాయుడు, నగర్ కార్యదర్శి మురళీమోహన్, కోశాధికారి పోతులయ్య, సుబ్బిరెడ్డి, లక్ష్మయ్య, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి నగదును అందిస్తున్న కమిషనర్

# బాల్య వివాహాలను అరికడదాం : సిడిపిఒ

**ప్రజాశక్తి-కుందుర్పి**

బాల వివాహాలను అరికట్టి అభం శుభం తెలియని బాలికలను కాపాడుకుందామని ఐసిడిఎస్ సిడిపిఒ వనజాక్షి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని అపిలేపల్లి జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన 'బాల్య వివాహాలు అరికడదాం.. ఆడబిడ్డలను కాపాడుదాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేయడం నేరమన్నారు. అంతేగాకుండా బాలికలకు పెళ్లిళ్లు చేయడం ద్వారా అనేక అనార్థాలకు దారి తీస్తాయన్నారు. ఆడ పిల్లలకు 18ఏళ్లు, మగ పిల్లలకు 21ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అలాకాకుండా బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ తిప్పేస్వామి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, ప్రధానోపాధ్యాయులు ధనుంజయ, ఉపాధ్యాయులు జయశ్రీ, జయరామ్‌నాయక్, నలిని, సుగుణ, జయలక్ష్మి, వైద్యసిబ్బంది భార్గవి, అంగన్వాడీలు, చిన్నారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఒ వనజాక్షి

# పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించాలని వినతి

**ప్రజాశక్తి-రాయదుర్గం**

బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లు గ్రామ పరిసరాల్లో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడే వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ సోమవారం సిపిఐ, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిరుతల మల్లికార్జున, నేమకల్లు గ్రామ రైతులు, సిపిఐ రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేమకల్లు గ్రామ పరిసరాల్లోని దుక్క ఇనుము(స్పాంజ్ ఐరన్) పరిశ్రమల నుంచి పెద్ద మొత్తంలో వెలువడుతున్న దుమ్ము, ధూళి వల్ల పంట పొలాలతో పాటు నేమకల్లులో ఇళ్లు, రహదారులు కూడా ఎరుపు రంగులోకి మారాయన్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి నెలకొందని, ఈ విషయమై అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని వాపోయారు. రైతులు పంటలు పూర్తిగా నష్టపోతున్నారని, వాతావరణ కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నట్లు తెలిపారు. కావున కలెక్టర్ వెంటనే పరిశ్రమలను తనిఖీ చేసి కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కాలుష్య నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో సిపిఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున, సహాయ కార్యదర్శి గురుస్వామి, ఎపి రైతు సంఘం రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి తిప్పేస్వామి, కణేకల్ మండల కార్యదర్శి గౌస్‌పీరా, రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఐ, రైతుసంఘం నాయకులు


ఇండోర్ స్టేడియం అధ్యక్షుడు గోవర్ధన శ్రీనివాసులు, కార్యదర్శి ఎం.సుబ్బారావును సన్మానిస్తున్న దృశ్యం

# ఇండోర్ స్టేడియం నూతన కార్యవర్గ కమిటీకి సన్మానం

**అనంతపురం :** ఇటీవల ఎన్నికైన అనంతపురంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియం నూతన కమిటీ సభ్యులను సోమావరం ఘనంగా సత్కరించారు. అధ్యక్షునిగా గోవర్ధన శ్రీనివాసులు, కార్యదర్శిగా ఎం.సుబ్బారావు ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, జయమారుతి, టిడిపి నేత మంజు, తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షుడిగా రమేష్



**గుత్తి :** ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షుడిగా గుత్తికి చెందిన మంగే రమేష్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు బుల్ల రాజారావు సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రమేష్ తెలిపారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలి

## డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ దీప

**ప్రజాశక్తి-పెద్దవడుగూరు**

పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ ఫ్లాస్టెన్స్ దీప పిలుపునిచ్చారు. 'అమ్మ పేరు మీద ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరుతో మొక్క నాటి సంరక్షించాలన్నారు. అమ్మ మనల్ని ఎలా పెంచి పెద్ద చేసిందో అదే తరహాలో నాటిన మొక్కను కూడా సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలన్నారు.. ఈ కార్యక్రమంలో కస్తూబా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ ఉషా, అధ్యాపక బృందం, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దీప


సోదనపల్లిలో పురవీధుల్లో ఊరేగుతున్న పీర్లు

# ఘనంగా చిన్నసరిగెత్తు

**శింగనమల :** మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని సోదనపల్లిలో సోమవారం చిన్న సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పీర్లస్వాములు తప్పెట్ల మోతల మధ్య పురవీధులకుండా ఊరేగించారు. కులమతాలకు అతీతంగా చక్కెర చదివింపులు చేశారు.


**నార్పల :** మండల కేంద్రంలో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం విడిదినం కావడంతో నాలుగు చావిళ్లలోని ప్రధాన పీర్లను గ్రామంలో ఊరేగించారు. మంగళవారం రాత్రి నార్పలలో అగ్నిగుండాలు వెలిగించి బుధవారం ఉదయం అగ్నిగుండ ప్రవేశ చేయనున్నట్లు ముజావర్లు తెలిపారు.

**బెలుగుప్ప :** మండల కేంద్రంలోని పీర్ల సావిడిలో వెలిసిన పొన్నూరు స్వామి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. పెద్ద సరిగెత్తును పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున మేళాలు, తప్పెట్లతో చక్కెర పొంగళి, బెల్లం పానకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


# అసభ్యకర ప్రవర్తనపై తక్షణ చర్యలు : డీఎస్పీ

**అనంతపురం క్రైం :** నార్పల మండల కేంద్రంలో మైనర్‌పై అనుచితంగా వ్యవహరించిన జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఆరోజే పోక్సోతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశాన్నారు. అంతేకాకుండా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి


నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

**గుత్తి :** స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘసంస్కర్త, రచయిత్రి, న్యాయవాది దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ జయంతిని పురస్కరించుకుని గుత్తి పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయి బాబు, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు షేక్షావలి, నారాయణరెడ్డి, గోవిందప్ప, నారాయణ శెట్టి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# బాలిక కుటుంబాన్ని ఆదుకుంటాం

**శింగనమల :** నార్పల మండల కేంద్రంలో బాలికపై వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడటం బాధాకరమని, బాధితు కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో భరోసా ఇచ్చారు. మహిళ పట్ల ఎవరు దురుసుగా ప్రవర్తించినా ఉపేక్షించే లేదని హెచ్చరించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను ఆదేశించామన్నారు. అతి త్వరలో అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి రిమాండ్ పంపనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా త్వరలో బాధిత బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు తెలిపారు.

# ఓబుళాపురంలో వనమహోత్సవం

**పుట్లూరు :** మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జి.మల్లేశ్వరమ్మ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్‌బి.జగన్నాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, అటవీ సిబ్బంది జి.వెంకటరమణ, సుధాకర్, గయాజుద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, గ్రామస్తులు మోహన్, శేఖర్, రామానాయుడు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

# వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

**గుత్తి :** పట్టణంలోని దాసరి కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఆర్‌బి.కమలాకర్‌కు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ సోమవారం ఆర్థిక సాయం చేశారు. కమలాకర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న నారాయణ కమలాకర్‌ను పరామర్శించి వైద్యఖర్చులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంకే.చౌదరి, జక్కల చెరువు ప్రతాప్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నారాయణ

# తాగునీటి సమస్య పరిష్కరించాలి

## జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**బుక్కరాయసముద్రం :** శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నిధులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జెడీ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఛైర్‌ఫర్సన్ బోయ గిరిజమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో తాగు నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. కావున సమస్య పరిష్కారానికి చొరవ చూపి సహకరించాలని కోరారు. ఇందుకు జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ సానుకూలంగా స్పందించారు.

# ఇంటింటికీ వెళ్లి మచ్చలను గుర్తించాలి

**పెద్దపప్పూరు :** ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలను గుర్తించాలని డాక్టర్ ఉషారాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్‌పై ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకూ ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆయా మచ్చలు ఉన్నవారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. ఈకార్యక్రమంలో సిహెచ్‌ఒ భారతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి సి.శ్రీనివాసులు, ఆరోగ్య పర్యవేక్షకులు శర్మష్‌వలి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## మొహర్రం వేడుకల్లో అపశృతి

### అగ్నిగుండంలో పడి వ్యక్తికి గాయాలు

**వజ్రకరూరు :** ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలంలోని పోలికి గ్రామంలో జరుగుతున్న మొహర్రం వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. పీర్లను ఎత్తుకున్న లక్ష్మీనారాయణ సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండం దాటుతుండగా నిప్పుల్లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.


గాయపడిన లక్ష్మీనారాయణ

# ఎవిఆర్ పాఠశాల పుస్తకాల గది సీజ్


పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న ఎంఇఒ ఈశ్వరప్ప

**వజ్రకరూరు :** ఉరవకొండలోని ఎవిఆర్ ఇంగ్లీష్ మీడియం ప్రయివేట్ పాఠశాలలోని పుస్తకాల గదిని మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప సోమవారం సీజ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. దీంతో స్పందించిన ఎంఇఒ పాఠశాల వద్దకు చేరుకుని పుస్తకాల గదిని పరిశీలించి సీజ్ చేశారు. ఇలాంటివి పునరావృతమైతే ఆందోళనల తీవ్రతరం చేస్తామని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సురేష్, రాజశేఖర్, సుధీర్, నిఖిల్, తేజ్, భీమేష్, భాస్కర్, సాగర్, భాస్కర్, పురుషోత్తం, పృథ్వీరాజ్, అశోక్, బ్రహ్మ తేజ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అన్నదానం

**పుట్లూరు :** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, కె.రామేశ్వరరెడ్డి, పి.మద్దిలేటిరెడ్డి, రమేష్, కుందు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' కూలీలకు బిల్లులు చెల్లించాలి

**పెద్దపప్పూరు :** ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికీ 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో రోజు కూలి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, సహాయ కార్యదర్శి తలారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు టీకాలు

**బెలుగుప్ప :** మండల పరిధిలోని జీడిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పశువులకు బొబ్బ చర్మవ్యాధి, ముద్ద చర్మవ్యాధి సోమవారం పశు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, పశుసంవర్ధక సహాయకులు అంకంపల్లి మారుతి, ఎర్రిస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.